క్లుప్తంగా

కనులపండువగా నగరోత్సవం

నెల్లూరు(బృందావనం): స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి జయంత్యుత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నగరోత్సవాన్ని కనులపండువగా బుధవారం జరిపారు. విశేష పుష్పాలతో తీర్చిదిద్దిన వాహనంలో పులివాహనంపై అమ్మవారు కొలువుదీరి భక్తులను అనుగ్రహించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు శేగు షణ్ముఖరావు, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి జనార్దన్‌రావు, ఉపాధ్యక్షుడు వేముల ప్రసాద్, మునగా వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడు ఆంజనేయులు పాల్గొన్నారు.

బాలాలయ మహాసంప్రోక్షణ

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థాన పునర్నిర్మాణాన్ని పురస్కరించుకొని స్వామివారి నూతన బాలాలయ మహాసంప్రోక్షణను ఆలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించారు. విద్వాన్ నరసరాజుభట్టార్, ప్రధానార్చకులు నారాయణస్వామి, మేల్కోటి, ధర్మకర్తల మండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, సభ్యులు ఆనం చంద్రశేఖర్‌రెడ్డి, మన్నెం లక్ష్మీనాథ్‌రెడ్డి, తుమ్మల సుమన్‌తేజారెడ్డి, ఈఓ జంజనం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నెల్లూరు సిటీ: గాంధీనగర్ నుంచి డైకస్ రోడ్డు వరకు చేపట్టిన సెంట్రల్ లైటింగ్, డివైడర్ పనులకు శంకుస్థాపనను రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బుధవారం నిర్వహించారు. టీడీపీ నేతలు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నోటిని అదుపులో పెట్టుకోవాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నోటిని అదుపులో పెట్టుకోవాలని.. ముస్లింలందర్నీ ఉగ్రవాదులతో పోల్చడం సరికాదని.. వెంటనే ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని సీపీఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్, ముస్లిం ఫెడరేషన్ రాష్ట్ర నేత జియా పేర్కొన్నారు. పహల్గామ్ దాడికి ప్రతీకార చర్యగా పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై దాడులు చేసిన భారత సైన్యానికి మద్దతుగా నగరంలోని వీఆర్సీ సెంటర్ వద్ద ప్రదర్శనను సీపీఐ, ఇన్సాఫ్, ఏఐవైఎఫ్, ఎస్డీపీఐ, ముస్లిం ఫెడరేషన్, ముస్లిం రైట్స్ ఫోరం, గిరిజన సమైఖ్య సంఘం, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. అజీజ్ అహ్మద్, మధు, అజీజ్, ఇర్ఫాన్, షాహుల్, ఉమర్, జిలానీ, రవి, షాజహాన్, మున్వర్, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతుల్లో ఆధారాలను సేకరించాలి



మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): నిందితులకు శిక్షలు పడటంలో నేర స్థలం నుంచి సేకరించిన ఆధారాలే కీలకమని, దీనికి గానూ శాస్త్రీయ పద్ధతులను అవలంబించాలని ఎస్పీ కృష్ణకాంత్ పేర్కొన్నారు. ఫొరెన్సిక్ సైన్స్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్‌పై నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో దర్యాప్తు అధికారులకు బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆధునిక నేరాలను ఆధునిక పద్ధతుల్లోనే ఎదుర్కోవాలని కోరారు. విచారణలో సాంకేతికతను సమర్థంగా వినియోగించడం ద్వారా నేరస్తులను చట్ట ప్రకారం ఎదుర్కోగలమని, దీనికి ఆధారాల నిర్వహణను శాస్త్రీయంగా చేపట్టాలని సూచించారు. సేకరించిన ఆధారాలను పరీక్షలకు పంపేంత వరకు పాటించాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. వివిధ అంశాలను ఫొరెన్సిక్ నిపుణులు వివరించారు. అనంతరం శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఫొరెన్సిక్ నిపుణులను ఎస్పీ సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఫొరెన్సిక్ నిపుణులు జయశ్రీ, శ్రీరామ్, శ్రీరాములురెడ్డి, శిరీష, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో విధులు నిర్వర్తించండి

సాక్షి ఎఫెక్ట్..



సిబ్బందితో మాట్లాడుతున్న నందన్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థలోని వివిధ విభాగాల సిబ్బంది తమ విధులను నిబద్ధతతో నిర్వర్తించాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. 'ప్రక్షాళన లేక.. పాలన సాగక' అనే శీర్షికన 'సాక్షి'లో కథనం మంగళవారం ప్రచురితమైన నేపథ్యంలో ఆయన స్పందించారు. ఈ క్రమంలో కార్పొరేషన్ కార్యాలయంలోని వివిధ విభాగాలను తనిఖీ చేశారు. పింఛన్ విభాగాన్ని సందర్శించిన ఆయన, ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ కేటగిరీల్లో పెన్షన్ లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు. టిడ్కో లబ్ధిదారులకు హౌసింగ్ విభాగ సిబ్బంది అందిస్తున్న సేవలను ఆరాతీశారు. సచివాలయాల కార్యదర్శుల అటెండెన్స్, మంజూరు చేసిన సెలవులు తదితరాలను పరిశీలించారు. నగరపాలక సంస్థ సెక్రటరీ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

కాలువలను ఆక్రమించొద్దు

నెల్లూరు(బారకాసు): నగరంలోని కాలువలను ఆక్రమించి ఎలాంటి నిర్మాణాలను చేపట్టొద్దని, నిబంధనలను అతిక్రమిస్తే తొలగిస్తామని కమిషనర్ నందన్ స్పష్టం చేశారు. ఏడో డివిజన్లోని నవాబుపేట, చాకలి వీధి, శెట్టిగుంట రోడ్డు, లక్ష్మీపురం, గమళ్ల వీధి తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. నవాబుపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రం, రైతుబజార్‌ను సందర్శించారు. అనంతరం ఆత్మకూరు బస్టాండ్ కూడలి నుంచి స్టోన్‌హౌస్‌పేటకు వెళ్లే ప్రధాన మూడు మార్గాలను బ్లాక్ చేస్తూ ఆక్రమించిన వీధి వ్యాపారాల దుకాణాలు, తోపుడు బండ్లను కమిషనర్ తొలగించారు. కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి, ఇంజినీరింగ్ విభాగ డీఈ రఘురామ్, వెటర్నరీ వైద్యుడు మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

➡ నగరంలోని అన్ని డివిజన్లలో రెండు వారాలకోసారి ఫాగింగ్ ప్రక్రియను అమలు చేయాలని కమిషనర్ సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పబ్లిక్ హెల్త్ విభాగం, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. హ్యాండ్ ఫాగింగ్ మెషీన్ల ద్వారా ఉదయం ఆరు నుంచి ఏడు వరకు.. సాయంత్రం 4.30 నుంచి ఏడు వరకు ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. ఎంహెచ్‌ఓ చైతన్య, మలేరియా విభాగాధికారి జిజియాబాయి, వెటర్నరీ వైద్యుడు మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

➡ భూగర్భ డ్రైనేజీ ఇంటింటి కనెక్షన్లు, తాగునీటి సరఫరా పనులను వేగవంతం చేయాలని కమిషనర్ నందన్ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం, మెగా, ఎల్ అండ్ టీ కంపెనీల ప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఓఎస్డీ రామకృష్ణ, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజినీరింగ్ విభాగ ఎస్ఈ రామ్మోహన్‌రావు, డీఈలు రఘురామ్, ముజాహిదీన్ తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా బాధితులకు అండగా ఉంటాం

నెల్లూరు(అర్బన్): తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు అండగా రెడ్‌క్రాస్ నిలుస్తోందని సంస్థ వైస్ చైర్మన్ జనార్దన్‌రాజు తెలిపారు. ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకొని మద్రాస్ బస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాధితుల కోసం 1500 యూనిట్ల రక్తాన్ని ఏటా అందజేస్తోందని వివరించారు. కార్యక్రమానికి హాజరైన వారికి భోజన వసతిని మహాయాగ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో కల్పించారు. తలసేమియా ప్రాజెక్ట్ కన్వీనర్ డాక్టర్ సీత, కో కన్వీనర్ పర్వీన్, రెడ్‌క్రాస్ కోశాధికారి సురేష్‌కుమార్‌జైన్, సెక్రటరీ మస్తానయ్య, డాక్టర్లు రమ్య, హరిత, మెడికల్ ఆఫీసర్ వరప్రసాద్, స్పాస్టిక్స్ సెంటర్ ప్రిన్సిపల్ గురునాథం, మైథిలీ స్కూల్ ఎండీ శశిప్రియ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు ధర్నా రేపు

నెల్లూరు (టౌన్): విద్యారంగ పరిరక్షణ కోసం కలెక్టరేట్ వద్ద ధర్నాను శుక్రవారం నిర్వహించనున్నామని ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి దశరథరాములు, హజరత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు అంశాలపై రాష్ట్రంలోని అన్ని తాలూకా కేంద్రాల వద్ద ధర్నాలు, నిరసనలను చేపట్టినా, చర్చలకు ఆహ్వానించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతోందని ఆరోపించారు. ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన పోస్టులు కేటాయించాలి

నెల్లూరు (టౌన్): సమగ్రశిక్ష కార్యాలయంలో సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్ పోస్టులను ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన కేటాయించాలని పీఆర్టీయూ – ఏపీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణారెడ్డి, అజయ్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల డైట్‌లో పోస్టులను ఉమ్మడి జిల్లా ప్రాతిపదికనే భర్తీ చేశారని చెప్పారు. విభజిత మండలాల నుంచి వచ్చిన దరఖాస్తులను పక్కనబెట్టడం తగదన్నారు.

విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

నెల్లూరు(అర్బన్): నగరంలోని 16 మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతిలో 570కుపైగా మార్కులను సాధించిన విద్యార్థులకు కటారి తిరుపాల్ అవార్డులను అందజేయనున్నామని సమతా నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ మాదాల వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఐఎంఏ సమావేశ మందిరంలో కార్యక్రమాన్ని ఈ నెల 11వ తేదీ ఉదయం తొమ్మిదికి నిర్వహించనున్నామని చెప్పారు. అర్హులు తమ మార్కుల మెమో, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను పొగతోటలోని సమతా నర్సింగ్ హోమ్‌లో శుక్రవారంలోపు అందజేయాలని కోరారు. వివరాలకు 94405 10891, 90526 76459 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

టీబీ నివారణకు ప్రణాళిక

నెల్లూరు(అర్బన్): టీబీ నివారణకు గానూ 100 రోజుల ఇంటెన్సిఫైడ్ క్యాంపెయిన్‌ను నిర్వహించాలని రాష్ట్ర క్షయ కార్యాలయం నుంచి వచ్చిన కన్సల్టెంట్ దేవగణేష్ పేర్కొన్నారు. టీబీ నివారణపై సమీక్ష సమావేశాన్ని బీవీనగర్‌లోని డేమియన్ ఫౌండేషన్ ఇండియా ట్రస్ట్‌లో ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. రోగులకు అందుతున్న సేవలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించారు.

ఆదిశంకరాచార్య సంస్మరణ సప్తాహాలు ప్రారంభం

నెల్లూరు(బృందావనం): పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో ఆదిశంకరాచార్య సంస్మరణోత్సవ సప్తాహాలను చక్రాల వారి ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. ఆదిశంకరాచార్యులు, శంకరభగవత్పాదుల పాదుకలకు అభిషేకాలు, పుష్పార్చనలను అనిల్‌కుమార్‌శర్మ, యాజ్ఞీకకుమార్‌శర్మ నిర్వహించారు. గుంటూరులోని శృంగేరి విరూపాక్ష శ్రీపీఠ మహాసంస్థాన అధిపతి గంభీరానందభారతి అనుగ్రహభాషణ చేశారు. భరతనాట్య ప్రదర్శనను గురుకృప కళాక్షేత్ర అధినేత్రి సురభిగాయత్రి బృందం జరిపారు. చక్రాల వారి ట్రస్ట్ నిర్వాహకులు చక్రాల ఆనంద్‌కుమార్, వెంకటలక్ష్మీనరసింహం,, కోట రాజశేఖర్, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా అంకురార్పణ

నెల్లూరు(బృందావనం): ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని అన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీవిశ్వనాథ దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలను బుధవారం ప్రారంభించారు. అంకురార్పణను అర్చకులు వందవాసి విశ్వనాథ గురుకుల్, గణేష్ గురుకుల్ ఆధ్వర్యంలో జరిపారు. ఉభయకర్తలుగా బొమ్మిశెట్టి విజయరామనాథ్, వెంకటశిల్ప దంపతులు వ్యవహరించారు. ఈఓ దర్గయ్య పర్యవేక్షించారు.

అల్లూరి సీతారామరాజుకు నివాళి



జేడీ కార్యాలయంలో..

నెల్లూరు(క్రైమ్): మన్యం ప్రజల హక్కులు.. దేశ స్వాతంత్ర్యం కోసం అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం నేటి యువతకు ఆదర్శమని ఎస్పీ కృష్ణకాంత్ పేర్కొన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నెల్లూరు (పొగతోట): నగరంలోని జేడ్పీ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ నివాళులర్పించారు. డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (టౌన్): నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఈఓ బాలాజీరావు, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బృందావనం): మద్రాస్ బస్టాండ్ సమీపంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతిని బీజేఎంఎం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అన్నదానాన్ని నిర్వహించారు. అడ్వొకేట్ రమాదేవి, రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్, ఆటో సంఘ అధ్యక్షుడు రమణయ్య, చంటి, జనార్దన్ పాల్గొన్నారు.

➡ పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో ఆలిండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సమాజ సేవకుడు తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, ఏఐడీఎస్‌ఓ జిల్లా ఇన్‌చార్జి సురేష్, సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు త్రినాథ్ పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): డీసీఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డీసీఓ గుర్రప్ప, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు శ్రీలత, ఉమామహేశ్వరి, సీనియర్ ఇన్‌స్పెక్టర్లు రసూల్‌ఖాన్, విజయలక్ష్మి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(అర్బన్): దర్గామిట్టలోని ఎన్జీఓ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారుపల్లి వెంకటేశ్వర్లు, నేతలు రామకృష్ణ, ఆంజనేయవర్మ, ప్రసాద్‌రెడ్డి, లక్కాకుల పెంచలయ్య, కిరణ్, రామకృష్ణారెడ్డి, మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

➡ సంతపేటలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, డెమో అధికారి కనకరత్నం, డీపీఓ రమేష్‌బాబు, సూపరింటెండెంట్ విజయకుమారి, మురళి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగనిరతిని అందరూ గుర్తెరగాలని జేసీ కార్తీక్ తెలిపారు. అమరవీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో నిర్వహించారు.

ఇంగ్లిష్ వర్డ్ చాంపియన్‌షిప్‌లో ఉత్తమ ప్రతిభ



నెల్లూరు (టౌన్): జాతీయ స్థాయిలో ముంబైలో నిర్వహించిన ఇంగ్లిష్ వర్డ్ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫిని సాధించిన రాష్ట్ర జట్టులో వండ్లూరు ఎమ్పీపీఎస్ స్కూల్ విద్యార్థి చరణ్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు శిరీషా పాల్గొన్నారు. ఈ క్రమంలో విజయవాడలోని సమగ్రశిక్ష కార్యాలయంలో వీరిని స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు అభినందించారు. డీఈఓ బాలాజీరావు, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య అభినందనలను తెలియజేశారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో మాక్‌డ్రిల్

నెల్లూరు సిటీ: నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మాక్ డ్రిల్‌ను పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ అనూష మాట్లాడారు. దాడి జరుగుతున్న సమయా ల్లో ప్రజలను చైతన్యవంతం చేసేందుకు, సురక్షితంగా బయటపడే అంశాలను వివరిస్తూ కార్యక్రమా న్ని చేపట్టామని చెప్పారు. అర్బన్ తహసీల్దార్ షఫీ మాలిక్, ఆర్టీసీ ఆర్ఎం మధుబాబు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీహెచ్‌ఓల నిరసన

నెల్లూరు(అర్బన్): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీహెచ్‌ఓల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భానుమహేష్ పేర్కొన్నారు. జిల్లా వైద్యశాఖ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమం బుధవారానికి పదో రోజుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన చేపట్టారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ డిమాండ్లను ఆమోదించాలని కోరారు. అసోసియేషన్ జిల్లా కో ఆర్డినేటర్ ఆదిల్, ఉపాధ్యక్షురాలు రెబెకా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మేడే సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా హమాలీలకు కబడ్డీ పోటీలను సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నిర్వహించారు. శెట్టిగుంటరోడ్డు సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు, నగర కార్యదర్శి నాగేశ్వరరావు, సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు నేతలు మస్తాన్‌బీ, మూలం ప్రసాద్, దామోదరరెడ్డి, శ్రీనివాసులు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

వేదగిరిలో ధ్వజారోహణ

నెల్లూరు సిటీ: నరసింహకొండలోని వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధ్వజారోహణను బుధవారం నిర్వహించారు. చప్పరోత్సవాన్ని జరిపారు. ఈఓ గోపీ, ఉత్సవ కమిటీ చైర్మన్ అచ్యుత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లతో సమీక్ష

నెల్లూరు రూరల్: జిల్లాలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో గుర్తించిన అంశాలపై చర్యలను వేగవంతంగా చేపట్టాలని జేసీ కార్తీక్ సూచించారు. సర్వే డిజిటలైజేషన్, నోషనల్ ఖాతాలు, నీటి తీరువా పన్నుల వసూలు, సిటిజన్ సర్వీసెస్ తదితర అంశాలపై కందుకూరు, కావలి రెవెన్యూ డివిజన్ల పరిధిలోని తహసీల్దార్లతో సమీక్ష సమావేశాన్ని తిక్కన ప్రాంగణంలో బుధవారం నిర్వహించారు. కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, కావలి ఆర్డీఓ వంశీకృష్ణ, సర్వే ఏడీ నాగశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భారత సైన్యానికి సెల్యూట్

నెల్లూరు సిటీ: ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం సరైన సమాధానమిచ్చిందని, వీరికి జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో సెల్యూట్ చేశారు. కుల, మత, రాజకీయాలకతీతంగా సైన్యానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు.

నెల్లూరు(బృందావనం): పాకిస్థాన్‌లో తీవ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేసి ముష్కరులను హతమార్చిన భారత సైన్యానికి సింహపురి కళాకారులు జేజేలు పలికారు. ఈ మేరకు నర్తకి సెంటర్‌లో జాతీయ పతాకాన్ని చేతబట్టి భారత్ మాతాకీ జై.. జయహో ఇండియన్ ఆర్మీ అంటూ నినాదాలు చేశారు. మిఠాయిలు పంపిణీ చేశారు. కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో జయప్రకాష్, సింగంశెట్టి మురళీమోహన్‌రావు, అబ్దుల్, రఘురామిరెడ్డి, కృష్ణ, నాగరాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

తిరుపతి క్రైమ్: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన తిరుపతిలో బుధవారం చోటుచేసుకుంది. ఈస్ట్ పోలీసుల కథనం మేరకు.. తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ జాతర సంబరాల్లో డప్పు కొట్టేందుకు గానూ నెల్లూరులోని గాంధీనగర్‌కు చెందిన పెద్దల తిరుపతన్న (20) వచ్చారు. ఈ తరుణంలో కొరమీనుగుంటలో ఇంటి వద్ద వేపాకు కోస్తుండగా, విద్యుత్ తీగలకు తగిలి మేడపై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందారు. గమనించిన సహచరులు.. ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాల తరలించారు.

భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం

నెల్లూరు(బృందావనం): విరాట్‌నగర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో స్వామివారి ఆరాధన మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. సుప్రభాతసేవ, అభిషేకాలు, చందనాలంకారం, గణపతిపూజ, పుణ్యాహవచనం తదితర పూజా కార్యక్రమాలను జరిపారు. దాదాపు రెండు వేల మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. సహస్ర దీపాలంకరణ సేవను రాత్రి నిర్వహించారు. భరతనాట్యాన్ని గురుకృప కళాక్షేత్ర విద్యార్థులు.. కోలాటాన్ని లక్ష్మీనారాయణ కోలాట బృందం ఆధ్వర్యంలో ప్రదర్శించారు. కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణ, డిప్యూటీ మేయర్ తహసీన్, నెల్లూరు పట్టణ విశ్వబ్రాహ్మణ సేవా సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు కందుకూరు చెంగయ్య ఆచారి, అలిమేలి సుబ్రహ్మణ్యం, బాలకృష్ణ, కందుకూరు జనార్దన్, దండపాణి సురేష్, ఇందుకూరు రమేష్‌కుమార్, అలిమేలి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

➡ భక్తవత్సలనగర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆరాధన మహోత్సవాన్ని నిర్వహించారు. భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు. ప్రసాద్, శివకుమార్, సుధాకర్ ఆచారి, శ్రీనివాసులు, వెంగయ్య, మునుస్వామిరెడ్డి, వీరబ్రహ్మ ఆచారి, సుధాకర్, మల్లికార్జున, రాముడు పాల్గొన్నారు.

మిస్టరీగా రియల్టర్ హత్య కేసు

నెల్లూరు(క్రైమ్): నగరంలో సంచలనం రేకెత్తించిన రియల్టర్ చిన్నయ్య హత్య కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. పక్కా పథకంతో చిన్నయ్యను హత్య చేసి కారంచల్లి చిన్నపాటి ఆధారం దొరక్కుండా జాగ్రత్తలు పాటించడాన్ని బట్టి నిందితులు ప్రొఫెషనల్ కిల్లర్లు అయి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. హత్య జరిగి 24 గంటలవుతున్నా, దర్యాప్తు ముందుకు సాగకపోవడంతో ఎస్పీ కృష్ణకాంత్ స్వయంగా రంగంలోకి దిగారు. ఏఎస్పీ సౌజన్య, నగర డీఎస్పీ సింధుప్రియ, ఫొరెన్సిక్ నిపుణుల ప్రత్యేక బృందం, చిన్నయ్య మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించిన వైద్యుడితో కలిసి ఘటన స్థలాన్ని ఎస్పీ పరిశీలించారు. ఫొరెన్సిక్, వైద్యుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. డాగ్‌స్క్వాడ్‌తో హత్య స్థలి, పరిసర ప్రాంతాల్లో క్షుణ్ణంగా మరోసారి తనిఖీలు చేయించారు. హత్య జరిగిన రోజున చిన్నయ్యతో పాటు అదే ఇంట్లో ఉన్న ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లును ఎస్పీ విచారించారు. ఘటన జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో, సమీప ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీలను ప్రత్యేక బృందాలు క్షుణ్ణంగా పరిశీలించినా చిన్నపాటి ఆధారం లభించలేదు. మృతుడి కాల్ డీటెయిల్స్, టవర్ డంప్‌ను పరిశీలిస్తున్నారు. మరోవైపు మృతుడికి తన స్వగ్రామంతో పాటు కలిగిరిలో పలువురితో భూ, ఆర్థిక సంబంధిత విభేదాలున్నాయని, అతని వల్ల పలువురు జైలుపాలయ్యారని, మరికొందర్ని మోసగించిన అంశాన్ని పోలీసులు గుర్తించారు. వారేమైనా ఈ ఘాతుకానికి ఒడిగట్టి ఉంటారానే కోణంలోనూ పోలీసులు విచారిస్తున్నారు. వివాహేతర సంబంధాలు ఏమైనా ఉన్నాయాననే కోణంలోనూ విచారణ సాగుతోంది. ఈ తరహా హత్యలకు పాల్పడే వారి వివరాలను సేకరిస్తున్నారు.

బ్యాంక్ ఉద్యోగి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): రైలు కిందపడి బ్యాంక్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు సమీపంలోని ఫ్లయ్‌ఓవర్ కింద మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. కొత్తూరుకు చెందిన వీరేంద్ర (29), అనితకు మూడేళ్ల క్రితం వివాహమవ్వగా, సంతానం లేదు. ధనలక్ష్మీపురంలోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డ్ సమీపంలోని ఫ్లైఓవర్ కింద నెల్లూరు వైపు వచ్చే పట్టాలపై రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరేంద్ర ఎంతకీ ఇంటికి రాకపోవడంతో నెల్లూరు రూరల్ పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. మృతుడి సెల్‌ఫోన్ టవర్ లొకేషన్‌ను పరిశీలించగా, కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు సమీపంలోని పట్టాల వద్ద చూపించడంతో రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే ఎస్సై హరిచందన తన సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకొని వీరేంద్ర మృతదేహాన్ని గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎస్సై కేసు నమోదు చేశారు.

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య, ప్రాజెక్ట్స్ డైరెక్టర్ ఆయూబ్‌ఖాన్‌ను తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయంలో జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ఈఈలు శ్రీధర్, శేషాద్రిబాలచంద్ర పాల్గొన్నారు.

రిజిస్టర్‌లో హాజరు నమోదు తప్పనిసరి

నెల్లూరు(బారకాసు): విధులకొచ్చే సెక్రటరీలు, పారిశుధ్య కార్మికులు రిజిస్టర్‌లో తమ హాజరును తప్పక నమోదు చేయాలని ఎంహెచ్‌ఓ చైతన్య ఆదేశించారు. నగరంలోని 4, 17వ డివిజన్లలో పారిశుధ్య పనులను బుధవారం ఆయన పరిశీలించారు. 17వ డివిజన్లోని ఆకుతోట సచివాలయంలో మస్టర్‌కు ఆలస్యంగా హాజరైన సెక్రటరీని మందలించారు. జాకీర్‌హుస్సేన్‌నగర్, మారుతినగర్‌లో ఫాగింగ్ ప్రక్రియ, పూడిక తీత పనులను పరిశీలించారు. మస్టర్‌కు హాజరుకాకపోవడంతో నాలుగో డివిజన్ సెక్రటరీకి మెమోను జారీ చేశారు.